"ఆపరేషన్‌కి అంతా సిద్ధం చేశాం. ఏం భయంలేదు. అంతా సర్దుకుంటుంది" ఆ మాటలు ఒకటికి పదిసార్లు విని విసుగొచ్చేసింది అభిరాంకి.

మహదేవ్‌ని స్ట్రెచర్‌మీద వేసి తీసుకెళుతుండగా జరిగిందా సంఘటన .....

"ఆగండి! మహదేవ్‌ని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళొద్దు"అతన్నే పరిశీలనగా చూస్తూ అరిచాడు తిరుపతి.

* * * * *

గ్రీష్మకాలపు సూర్యుడిలా మండుతున్న గుండె! శిశిరంలో చిగురుటాకులా గజగజ వణుకుతున్న శరీరం .....

ఆనందపు సంధ్యా కాంతుల్నుంచి వేదనాభరితమైన శూన్యంలోకి నెట్టేయబడుతున్న అనుభూతి ..... వర్ణనాతీతం కాని మానసికాందోళన .....

మంచంమీద పడుకున్న మనస్విని దిగ్గున లేచి కూర్చుంది. అంతటా నిశ్శబ్దం ..... ప్రకృతిలో ఏ జీవీ ఆవిర్భవించని కాలాన్ని గుర్తుకు తెచ్చేలా .....

అప్రయత్నంగా కిటికీలోంచి అంబరాన్ని తాకాయామె చూపులు!

చీకటి! జననానికీ, మరణానికీ మధ్య ఆత్మని తనలో దాచుకున్నంత చిక్కగా ..... నల్లగా.

ఆమె మంచం దిగి స్విచ్చాన్ చేసింది. మరుక్షణం గదంతా ట్యూబ్ లైట్ కాంతితో నిండిపోయింది. వాటర్ ఫిల్టర్‌లోంచి నీళ్ళు వంపుకుని తాగింది.

'చల్లటి మంచినీళ్ళు గొంతులోకి జారుతున్నా ఏదో చెప్పలేని బాధ ..... ఎందుకు?' ఆమెకే అర్థంకాలేదు.

లైటాఫ్ చేసి పక్కమీదకి చేరింది.

నిద్ర రావటంలేదు. సుడులు తిరుగుతున్నట్లు గుండెల్లో ఏవో ప్రకంపనాలు!

'ఎందుకిలా అవుతోంది? ఇంతకుముందు కూడా ఏ కారణమూ లేక పోయినా తన మనసు అల్లకల్లోలమై పోతున్నప్పుడు మేడం తెలివిగా తనని డైవర్ట్ చేయటం, క్రమంగా తనలోని దిగులు పోయి మామూలుగా అవటం గుర్తొచ్చింది. వెంటనే మరొక విషయం కూడా స్ఫురించిందామెకి.

అది మహదేవ్ ఏక్సిడెంట్‌కు గురికావటం ..... అతనికి ఏక్సిడెంట్ జరిగిన రోజే తనకి తెలియకుండానే మనసంతా గుబులుగా, ఆందోళనగా తయారయి తనని అతలాకుతలం చేయడం.

అంతే! ఒక్కసారిగా ఆమె హృదయచలనం రెట్టింపు వేగాన్ని అందుకుంది ఆ విషయం గుర్తొచ్చి .....

'మహదేవ్‌కి ఏమైనా జరిగిందా మళ్ళీ?' అనుకుంది. ఆ ఆలోచనతో ఆమె స్థిమితం కోల్పోయింది. మంచం దిగి ట్యూబ్‌లైట్ ఆన్ చేసింది.

మళ్ళీ ఆమె కళ్ళు అనాలోచితంగా వాల్‌క్లాక్‌వైపు తిరిగాయి. అప్పుడు సమయం

అర్థరాత్రి పన్నెండున్నర దాటింది. ఏం చెయ్యాలో తోచలేదామెకి. ఆలోచనలు మెదడుని కుమ్మరి పురుగుల్లా దొలిచేస్తున్నాయ్.

మహదేవ్‌కి మళ్ళీ ఏదో జరిగి ఉంటుంది. అందుకే తన మనస్సు యిలా అతలాకుతలం అవుతోంది.

తననిప్పుడేం చేయాలి. అతని పరిస్థితేమిటో, ఎలా వున్నాడో తెలుసుకుంటే కానీ ఈ మనసు చేస్తున్న చిత్రమైన చేష్టల్ని ఆపలేదు. ఎలా? సమయం చూస్తే అర్థరాత్రవుతోంది.

పోనీ మేడం గదికి వెళ్ళి అభిరాంకి ఫోన్ చేస్తే ..... అవును ..... అభిరాం యింటికి ఫోనుంది. అతనికి ఫోన్ చేసి మహదేవ్‌కెలా వుందో తెలుసుకోవాలి' అనుకుని తలుపు తీసుకుని కారిడార్‌లోంచి నడుస్తూ మేడం గదిని చేరుకుంది.

ఆశ్చర్యం ..... మేడం గదికి తాళం వేసుంది. ఎప్పుడూ లేనంత నిస్సత్తువ ఆవరించుకుందామెకి.

'మేడం ఎప్పుడోకాని బయటకు వెళ్ళరు. అదీ ఎంతో అవసరమైన పనుంటే తప్ప ..... పుస్తకాలు చదువుతూ, మంచి సంగీతం వింటూ ఆమె తన గది దాటి సాధారణంగా బయటకు వెళ్ళరు. అటువంటి మనిషి ఇంత అర్థరాత్రి ఎక్కడికెళ్ళినట్లు?

సాయంత్రం కూడా తనకి కనిపించారు కదా. ఏమో ఆమెకేం పని పడిందో? ఎవరయినా బంధువుల ఇంటికెళ్ళారా? తనకి తెలిసినంతవరకూ ఆమెకి బంధువులెవరూ లేరు. నా అనే వాళ్ళెవరూ లేని మేడం హాస్టల్‌నీ, అందులో వున్న తనలాంటి వాళ్ళనే బంధువులుగా భావిస్తుంది.

ఆమె ఎవర్నో ప్రేమిస్తే అది విఫలం కావటం వల్లనే పెళ్ళి చేసుకోకుండా ఇలా మోడులా ఒంటరిగా జీవిస్తూ హాస్టల్ నడుపుతుందని తనతో ఒకప్పుడు ఎవరో అన్నారు.

తనకంటూ ఏ తోడూ లేకుండానే ఆమె యవ్వనంలోంచి వృద్ధాప్యంలోకి జారిపోయారట. అటువంటి మనిషికి ఏ బంధువులుంటారు?'

"కౌన్ హై ఉదర్?" మనస్విని ఆలోచనలని చెదరగొడుతూ వినిపించాయ్ గూర్ఖా మాటలు.

"మై మనస్విని హుఁ ....." అందామె.

టక్ ..... టక్ ..... టక్ ..... టక్ ..... నిశ్శబ్దంలో గూర్ఖా బూట్లచప్పుడు పెద్దగా వినిపించింది.

"క్యా హువా? మేడంజీ సే కుచ్ కామ్ హై?" ఆమెని సమీపించి ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఆఁ ! ఫోన్ కర్నా చాహతీ హుఁ మై"

"ఇతనీ రాత్‌మే?"

"ఆఁ ..... మేడం కిదర్ గయీ?"

"ముజే బతాయా నహీ! సాడే ఆఠ్ బజే బాహర్ గయా! అబ్‌తక్ లౌట్ నై ఆయీ."

'ఎలా ఇప్పుడు ఫోన్ చెయ్యడం?' ఆందోళనని మునిపంట బిగిస్తూ అనుకుందామె.

"కిస్‌కో ఫోన్ కర్నా?మా బాప్‌కో?"

"నె ..... లోకల్‌ఫోన్ ..... ఏక్ ఫ్రెండ్ ఆస్పతల్ మే భర్తీ హుయీ! ఉన్‌కీ తపేద్ (హెల్త్) కౌన్‌సీ స్థితీమే హుయీ మాలూమ్ నహీ పడ్తీ! ముజే డర్ లగ్‌తీ ఉన్‌కీ స్థితీ పర్" అన్నది మనస్విని.

చిగురుటాకులా కంపిస్తూ చెప్పిన ఆమె మాటలకి కరుగ్గా కనిపిస్తున్న గూర్ఖాకి ఏం దయ కలిగిందో- "పే ఫోన్ బూత్‌సే ఫోన్‌కర్లో ..... మైం భీ తేరీ సాత్ ఆయేగా."

అప్పుడు మనస్వినికతడు దేవుడిలా కనిపించాడు. 'అలాగే' అన్నట్టు మౌనంగా తలూపింది.

గూర్ఖా ముందుకు సాగిపోయాడు.

అతన్ని అనుసరిస్తూ మనస్విని .....

జేబులోంచి తాళాలగుత్తితీసి గేటుకున్న తాళం తెరిచాడు. గేటు తెరిచి మనస్వినితోపాటు బయటకు నడిచి మళ్ళీ తాళం వేశాడు.

అతని డ్యూటీమైండ్‌కి ఆమె ఆశ్చర్యపోలేదు ..... అతని సిన్సియారిటీ ఆమెకి ముందే తెలుసు.

నిశ్శబ్దాన్ని చీలుస్తూన్నట్టు బూట్లని టక్‌టక్‌టక్ మనిపిస్తూ నడవసాగాడతను. అతని వెనకే మనస్విని! తల్లి వెనక సాగిపోతున్న చిన్న పాపాయిలా .....

హాస్టల్‌కి అయిదు నిమిషాల నడక దూరంలో వున్న ఫోన్‌బూత్ వైపు ఇద్దరూ సాగిపోతున్నాడు. ఒకటి- అరా వాహనాలు తప్ప నిర్మానుష్యంగా, ప్రశాంతంగా వుంది వాతావరణం.

తారసపడిన ఒకరిద్దరు వ్యక్తులు ముందు నడుస్తున్న గూర్ఖానీ, అతని వెనక మనస్వినినీ నోరెళ్ళబెట్టి చూస్తూ సాగిపోయారు.

ఇరవై నాలుగు గంటలూ తెరిచే వుంటుందా బూత్. అందులో కూర్చున్న యువకుడు నిద్రమత్తులో జోగుతున్నాడు వీళ్ళు వెళ్ళేసరికి.

'టక్ ..... టక్ ..... టక్ ..... టక్' తలుపుమీద చేతితో కొట్టాడు గూర్ఖా. తుళ్ళిపడ్డట్లు చటుక్కున కళ్ళు తెరిచాడు బూత్‌లోని యువకుడు.

చెవి దగ్గర చెయ్యుంచుకుని ఫోన్ చెయ్యాలన్నట్టు సైగచేశాడు గూర్ఖా.

దాంతో అతను తలుపు తీశాడు. అతని మొహంలో విసుగు. మంచి నిద్ర పాడుచేసిన గూర్ఖా వైపు చిరాగ్గా చూశాడు. గూర్ఖా పక్కకు జరగ్గానే అతనికి కనిపించింది మనస్విని. ఆశ్చర్యంగా ఆమెవైపే చూశాడు. ఇప్పుడతని మొహంలో విసుగూ, చిరాకూ ఏమీ కన్పించలేదు. కుతూహలం తప్ప!

"ఎస్.టి.డి.యా" అడిగాడతను.

"కాదు లోకలే" అందామె.

ఎర్రని దొండపళ్ళలాంటి ఆమె పెదవుల వంక చూసి 'ఏ అదృష్టవంతుడి సొత్తో ఈమె' అనుకుని గూర్ఖా వైపు చూశాడు,

అతను బూత్‌కి కొంచెం దూరంలో నిలబడి అటూ ఇటూ చూస్తున్నాడు. మనస్విని గబగబా అభిరాం ఫోన్ నెంబర్ ప్రెస్‌చేసి, అటునుంచి రింగవటంతో ఆదుర్దాగా ఎదురుచూడసాగింది.

క్షణాలు గడుస్తూ ఆమెని మరింత కలవరానికి గురిచేస్తున్నాయే తప్ప ..... అట్నుంచెవరూ ఫోనెత్తలేదు.

"ఏమైపోయాడు అభిరాం? మొద్దునిద్ర పోతున్నాడా? లేకపోతే ఇంట్లో లేడా? ఇంట్లో లేకపోవడానికి కారణమేమిటి ..... ?

కొంపతీసి నిజంగానే మహదేవ్ పరిస్థితి బాగులేకపోతే అతని దగ్గరకి వెళ్ళాడా? లేక వూళ్ళో లేడా? అతను లేకపోతే పోయే ..... వాళ్ళమ్మమ్మ వుంటుంది కదా! ఏమైందో ఆమె కూడా ఎత్తటంలేదు ఫోన్ ..... భగవంతుడా! ఏమిటీరోజు ఇలా అవుతున్నాయన్నీ?' నిస్సహాయంగా అనుకుందామె.

ఇంతలో ఫోన్ రింగవటం ఆగిపోయింది.

రిసీవర్ హుక్స్‌ని చేత్తో నొక్కి మళ్ళీ అదే నంబర్ని రిపీట్ చేసింది మనస్విని.

బూత్‌లోని యువకుడు ఆందోళనతో ఎర్రబారుతున్న మనస్విని ముఖారవిందాన్ని అతి సమీపంలోంచి తిలకిస్తూ వుండిపోయాడు.

గూర్ఖా ఒకసారి మనస్వినివైపు చూసి తిరిగి తల తిప్పేసుకున్నాడు.

రింగ్ టోన్ వినిపిస్తోంది కానీ ఎవరూ ఎత్తటంలేదు. పరిమితకాలంపాటు రింగయి రింగయి మళ్ళీ ఆగిపోయింది ఫోన్. "ప్చ్ ..... " అంటూ నిట్టూర్చి బయటకు నడిచిందామె.

"మళ్ళీ ట్రై చేయండి! పడుకున్నారేమో ..... అర్జంట్ విషయంలా వుందికదా" మనస్వినిని మరికొంచెంసేపు ఆపటానికి ఆమెతో అన్నాడతను.

సముద్రంలో మునిగిపోతున్నవాడికి చిన్న ఆధారం లభించినట్లు. తన నిద్ర పాడుచేసినా కూడా చిరాకు పడకుండా మళ్ళీ మళ్ళీ ట్రై చేయమంటున్న అతనివైపు కృతజ్ఞతగా చూసి, మరోసారి ప్రయత్నించింది.

డయల్ టోన్ విన్పిస్తోంది.

ఆమె గుండెలదురుతున్నాయి. గూర్ఖా మళ్ళీ ఆమెవైపు చూసి మొహం తిప్పేసుకున్నాడు. బూత్‌లోని యువకుడు ఆమెవంకే చూస్తున్నాడు.

"హలో ..... ఎవరూ?" అంటూ విన్పించింది అట్నుంచామెకి.

*   *   *   *   *

అభిరాం, వరప్రసాదం, డాక్టర్ ..... ఇంకా అక్కడున్న చాలామంది చిత్రంగా చూశారు తిరుపతివైపు.

"ఎందుకని?" ప్రశ్నించాడు డాక్టర్.

అతనెవరో అంతుపట్టలేదతనికి.

"మహదేవ్‌కి ఆపరేషన్ చేయనవసరంలేదు."

"మీరెలా చెప్పగలరా సంగతి?"

"దయచేసి ఎటువంటి ప్రశ్నలూ అడక్కండి నన్ను. ప్రస్తుతం అతనికి ఆపరేషన్ మాత్రం చేయనక్కర్లేదు ..... " అన్నాడు తిరుపతి.

"ఇంతకీ అసలు మీరెవరు?" కఠినంగా మారింది డాక్టర్ స్వరం.

"మావాళ్ళే ..... " చటుక్కున అన్నాడు వరప్రసాదం. మహదేవ్‌కి ప్రస్తుతం ఆపరేషన్ అక్కర్లేదని తిరుపతి చెప్పిన మాటలు అతను నమ్మాడు.

అభిరాం మాత్రం ఏం చేయాలో పాలుపోనట్టు అయోమయంగా చూస్తుండిపోయాడు.

"ఏ పరిజ్ఞానంతో మీరీ ఆపరేషన్ చెయ్యనవసరంలేదని అంటున్నారు?" తిరుపతి మహదేవ్ తాలూకేనని వరప్రసాదం చెప్పాక కూల్‌గా అడిగాడు డాక్టర్.

"అవన్నీ నేను చెప్పలేను. నా మాటలమీద మీకు నమ్మకం లేకపోతే మరోసారి మహదేవ్‌ని స్కానింగ్ చేయండి" అన్నాడతను.

డాక్టర్ మౌనంగా వుండిపోయాడు.

అభిరాందీ అదే పరిస్థితి!

"ఆయన చెప్పినట్లు మళ్ళీ స్కానింగ్ చేద్దాం. అప్పుడు తెలుస్తుందిగా అసలు విషయం" అన్నాడు వరప్రసాదం.

"నాదేముంది! అలాగే చేద్దాం" అన్నాడు డాక్టర్.

మళ్ళీ మహదేవ్‌ని స్కానింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళి పడుకో బెట్టారు. కొంత తతంగం తరువాత అతన్ని స్కానింగ్ చేయసాగాడు డాక్టర్.

అందరూ ఆత్రుతగా ఎదురుచూడసాగారు.

స్కానింగ్ ఎనలైజర్ మహదేవ్ పక్కటెముకల్ని కంప్యూటర్ స్క్రీన్‌మీద ఆవిష్కరించింది.

ఆశ్చర్యం! ఇందాక స్కానింగ్‌లో మహదేవ్ పక్కటెముకపై పెరుగుతున్న మరో ఎముక ప్రస్తుతం లేదు ..... ఏదో అజ్ఞాతశక్తి ఎవరికీ తెలియకుండా దాన్ని అదృశ్యం చేసినట్లు.

'ఇరవై ఏళ్ళ తన వైద్యవృత్తిలో ఎప్పుడూ ఎదురుకాలేదు ఇటువంటి సంఘటన' అనుకున్నాడు డాక్టర్. మరుక్షణం అతనక్కడ లేడు.